## ఓటు వజ్రాయుధం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

సైదాబాద్, జనవరి 25 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం అని శ్రీ వెంకటేశ్వర కామర్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గంధం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చంపాపేటలోని కాలేజ్‌లో 15వ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగం కుల, మత, వర్గ, వర్ణబేధాలు లేకుండా 18 ఏండ్లు నిండిన ప్రతీ భారతీయుడికి ఓటు హక్కును ప్రసాదించి తద్వారా తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకొనే అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థులతో ఓటు వినియోగించుకోవటమే కాకుండా కుటుంబ సభ్యులందరితో వినియోగించుకొనేటట్లు బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సునీత, సన, గంగాభార్గవి, రమణయ్య, శివరామ శర్మ పాల్గొన్నారు.

## ప్రలోభాలకు లోనుకావద్దు



కందుకూరు, జనవరి 25 : విద్యార్థులు, యువత ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కందుకూరు తహసీల్దార్ గోపాల్ తెలిపారు. ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సై సైదులు, ఆర్ఐలు యాదగిరి, శేఖర్, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసౌకర్యం కలుగకుండా దారిని ఏర్పాటుచేయాలి



పద్మానగర్ కాలనీవాసులకు అసౌకర్యం కలుగకుండా దారి ఏర్పాటు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల అధికారులకు సూచించారు. మలక్‌పేట రైల్వే స్టేషన్‌వద్ద నిర్మించిన కొత్త ఆర్‌యూబీతో పద్మానగర్ కాలనీవాసులకు దారిలేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, పోలీసు అధికారులు, హెచ్‌ఆర్‌డీసీఎల్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ డీఈ, ఏఈ తో కలిసి కొత్త ఆర్‌యూబీ, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాత మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

- మలక్‌పేట

# పాలకవర్గ సభ్యులకు సన్మానం



బడంగ్‌పేట : బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీ పాలన చివరిరోజు కావడంతో కౌన్సిల్ సమావేశం నిర్వహించి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. మీర్‌పేట, జల్‌పల్లిలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. మంచి రాజకీయ నాయకులుగా ఎదగాలని, మంచి నడవడికను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. పదవి కాలం అయిపోయినా.. ప్రజాసమస్యలపై స్పందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్లు ఆర్.జ్ఞానేశ్వర్, వెంకట్రామ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

లింగోజిగూడ డివిజన్‌లో మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు పార్శపు శ్రీధర్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మధుసాగర్, కొండల్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి, స్కైలాబ్, ఇటిక్యాల యాదగిరి, జలెందర్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించడంతో పాటుగా శాలువాతో సన్మానించారు.

- ఎల్బీ నగర్



చంచల్‌గూడ జైలులో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా న్యాయసేవ సాధికారిక సంస్థ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా

## న్యాయసేవలు సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్ : జిల్లా న్యాయసేవ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో శనివారం చంచల్‌గూడ జైలులో ఖైదీల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఖైదీల హక్కులు, న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ రాజేశ్, హైదరాబాద్ జిల్లా న్యాయసేవ సాధికారిక సంస్థ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా హాజరయ్యారు. మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా మాట్లాడుతూ.. జైలులో ఉన్న పేద ఖైదీలకు అన్ని రకాల న్యాయసేవలు, సహాయం అందిస్తామని, ఖైదీలు తమ హక్కులను పొందుతూనే జైలు నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణతో నడుచుకుంటూ తమ విధులను నిర్వర్తించాలన్నారు. జైళ్లశాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ రాజేశ్ మాట్లాడుతూ.. జైలులో నిబంధనల మేరకు సదుపాయాలను కల్పిస్తున్నామని, సేవలను మెరుగుపర్చి దేశంలో జైళ్ల శాఖని ముందుకు నడిపించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ దేవుల నాయక్, డిప్యూటీ జైలర్లు, నాంపల్లి జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ డిఫెన్స్ ప్యానల్ న్యాయవాది ఫసియుద్దీన్, నరేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.




# ట్రాఫిక్ నియమాలు పాటించాలి

మలక్‌పేట, జనవరి 25 : ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఈస్ట్‌జోన్ ఆర్టీఏ కార్యాలయ ఎంవీఐ రాధిక అన్నారు. దేశంలో ప్రతియేటా లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల బారినపడి తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగుల్చుతున్నారని వాపోయారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం కర్మన్‌ఘాట్ ఎస్‌ఆర్‌డీజీ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, రోడ్డు భద్రత, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019పై ఆమె అవగాహనను కల్పించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్లో వెళ్లటం, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్న వారిలో ఎక్కువ శాతం18 నుంచి 40 ఏండ్ల లోపువారే ఉంటున్నారన్నారు. ట్రాఫిక్ నియమాలను పాఠశాల స్థాయి నుంచే పాఠ్యాంశంగా బోధించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్, జనవరి 25 : ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీఓ కె. అమర్‌నాథ్ తెలిపారు. జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం బండ్లగూడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం – రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' నినాదంతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్టీసీ బస్సులను నిలిపేందుకు ఏర్పాటు చేసిన బస్ బేలలోనే బస్సులను ఆపాలని సూచించారు. అతి వేగంతో వాహనాలను నడిపి ఇతర వాహనాదారులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో బండ్లగూడ ఆర్టీసీ డిపో డీవీఎం జగన్, డీఎం వెంకటేశం, ఎంవీఐలు అనిత, కమల్‌కాంత్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఈస్ట్‌జోన్ ఆర్టీఏ కార్యాలయ ఎంవీఐ రాధిక


భద్రత మాసోత్సవాల్లో భాగంగా బండ్లగూడ ఆర్టీసీ డిపోలో సమావేశంలో మాట్లాడుతున్న నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీఓ కె. అమర్‌నాథ్







# అంబేద్కర్ విగ్రహ దిమ్మె పునర్నిర్మాణంపై ఉద్రిక్తత


మాదన్నపేట మార్కెట్‌లో అంబేద్కర్ విగ్రహ దిమ్మె పునర్నిర్మాణ పనుల వద్ద దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు

సైదాబాద్ : మాదన్నపేట మార్కెట్‌లో కూలిపోయిన అంబేద్కర్ విగ్రహ దిమ్మె పునర్నిర్మాణ పనులు శనివారం కొనసాగిస్తుండగా కొందరు అడ్డుకోవటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం తెలియడంతో దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివచ్చారు. దిమ్మె పనులు అడ్డుకోవటం.. పునర్నిర్మాణం చేస్తామని చెప్పడంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం ఏర్పడి మార్కెట్‌లో వివాదం తలెత్తడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఇరువర్గాలను శాంతపర్చి పరిస్థితులను చక్కదిద్దారు. దళిత సంఘాల నాయకులు పనులు పూర్తి అయ్యేవరకు టెంట్ వేసుకొని బైఠాయించి పూర్తి చేయించారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు రమేశ్ మాదిగ, వై.సురేశ్ కుమార్ (సోను), బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోర్ల భరత్ రాజ్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు కూలిన విగ్రహ దిమ్మె పనులు చేస్తుండగా, అడ్డుకోవటం మంచి పద్ధతి కాదన్నారు. దిమ్మె కూలి పోవడంలో గుర్తు తెలియని వ్యక్తుల పాత్ర ఉందని, సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తే తెలుస్తాయని, పోలీసులు వాటి తీసుకెళ్లటం భావ్యం కాదన్నారు. అంబేద్కర్ విగ్రహంపై వివక్ష చూపిస్తున్న వారు తమ పద్ధతులను మార్చుకోవాలని హితవు పలికారు. దళిత, ఎమ్మార్పీఎస్ నాయకులు రేడ్లపాక రవినాయకులు రమేశ్, అనిల్ యాదవ్, గౌతమ్, నాగరాజ్, మోహన్ కృష్ణ, రవి, అంజి పాల్గొన్నారు.




## రక్తదానం మహాదానం

ఆర్కేపురం, జనవరి 25 : రక్తదానం మహాదానమని షైన్‌వెవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డా.ముస్తఫా అన్నారు. శనివారం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముస్తఫా మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల అనారోగ్యానికి గురికారని, ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయవచ్చని సూచించారు. రక్తం సరైన సమయంలో దొరక్క చాలా మంది చనిపోతున్నారని పేర్కొన్నారు.

## నూతన విద్యావిధానాలు అలవర్చుకోవాలి



నూతన విద్యావిధానాలను అలవర్చుకోవాలని హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఐటీ జేఎన్‌టీయూ కె. శాంతిశ్రీ అన్నారు. కామినేని చౌరస్తా సమీపంలోని ఎస్‌కే గార్డెన్‌లో శనివారం అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. మిలాప్ 2025 పేరుతో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై అవంతి కళాశాలల చైర్మన్ ఎం. శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఎంఎంసీఐటీ ఎండీ విజయ్‌కిరణ్ అగస్త్య, ఏఐసీ టీహబ్ మేనేజర్ డాక్టర్ గౌరవ్ గుప్త, అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ డైరెక్టర్, హెచ్‌ఆర్ డాక్టర్ వై. జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రామచంద్రారెడ్డి, డాక్టర్ అజ్మల్ హుస్సేన్ పాల్గొన్నారు.

- మన్సూరాబాద్

## వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందాడంటూ ఆందోళన


శ్రీనివాస్ (ఫైల్)

మన్సూరాబాద్, జనవరి 25: వైద్యుల నిర్లక్ష్యంతో యువకుడు మృతి చెందాడంటూ ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు నాగోల్‌లోని సుప్రజ దవాఖాన వద్ద ఆందోళనకు దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, బండ్లగూడకు చెందిన శ్రీనివాస్ (22) నగరంలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15న రాత్రి నాగోల్ నుంచి బండ్లగూడ వైపునకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీ కొట్టిన ఘటనలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం నాగోల్ సుప్రజ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి శ్రీనివాస్ మృతి చెందాడు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని అక్కడి చేరుకున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు దవాఖాన వద్ద ఆందోళనకు దిగారు. చికిత్స పేరుతో రూ. 5 లక్షలు వసూలు చేశారని, శ్రీనివాస్ ఆరోగ్యం కుదురుగానే ఉందంటూ చెబుతూ వస్తూ చివరకు మృతి చెందాడని దవాఖాన వర్గాలు చెప్పడంపై కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాస్ మృతి చెందాడని తమకు న్యాయం చేయాలంటూ బైఠాయించారు. విషయాన్ని తెలుసుకున్న నాగోల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడి చేరుకుని మృతుడి కుటుంబీకులు, బంధువులను సముదాయించడంతో గొడవ సద్దుమనిగింది.

## గుంతలమయంగా..



గుంతలమయంగా మారిన రోడ్లతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఆదిత్యనగర్ కాలనీ, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపం నుంచి మధురానగర్ మీదుగా విజయవాడ జాతీయ రహదారికి చేరే మార్గం అస్తవ్యస్తంగా మారింది. 50 కాలనీల ప్రజలు ఈదారి గుండా జాతీయ రహదారికి చేరుకుంటారు. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కలుగజేసుకుని రోడ్డును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

- మన్సూరాబాద్

# ఈతచెట్ల పెంపకానికి ఐదెకరాలు కేటాయించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

కందుకూరు : ఈత చెట్ల పెంపకానికి ఐదెకరాలు కేటాయించాలని గౌడ సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి వచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గౌడ సంఘం మండలాధ్యక్షుడు ఆనేగౌని పాండుగౌడ్, కార్యవర్గ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. గౌడ సంఘం నాయకులు, మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని, న్యాయమైన కోర్కెలను తీరుస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, టీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, ఏనుగు శ్రావణి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సరికొండ మల్లేశ్, సురుసాని రాంరెడ్డి, గౌడ సంఘం నాయకులు మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, సొడపు శేఖర్‌గౌడ్,ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, యుగేంధర్ గౌడ్, సొడపు వెంకటేశ్ గౌడ్, సురేశ్ గౌడ్, భిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.

### అర్హులందరికీ రేషన్ కార్డులు..

ఆర్కేపురం : అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదని మంత్రి పొన్నం అన్నారు. ఆర్కేపురం కాలనీ సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్ భవనం, హరిపురి కాలనీ సీనియర్ సిటిజన్స్ భవనం, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంటెస్టెండ్ కార్పొరేటర్ పున్న నిర్మాల గణేశ్, తల్లాటి రమేశ్ నేత, సురేశ్, ముప్పిడి లింగ స్వామిగౌడ్ పాల్గొన్నారు.

బడంగ్‌పేట, జనవరి 25 : ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శంకుస్థాపనలు చేశారు.

### ఎంపీ కొండా నిరీక్షణ..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గంటల తరబడి నిరీక్షించారు. ఉదయం 11 గంటలకు అల్మాస్‌గూడకు వచ్చారు. 12 : 30 గంటలకు వరకు ఎదిరిచూసినా మంత్రి పొన్నం రాకపోడంతో ఎంపీ వెనుదిరిగి పోయాడు. ఎంపితో పాటు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు వెళ్లిపోయారు. సమయ పాలన పాటించక పోవడంతో బీజేపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు డుమ్మా..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి కూడా హాజరు కాలేదు. ఎమ్మెల్యే రాక పోవడంతో స్థానిక బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు డుమ్మా కొట్టారు. ఇదంతా కాంగ్రెస్ వాళ్లు చేస్తున్న అంశాలను పరిగణంలోకి తీసుకొని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు రాలేదని తెలుస్తున్నది. బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల డివిజన్లలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. సంబంధిత అధికారులు సైతం సమాచారం ఇచ్చి ఇవ్వన్నట్లు చెప్పడంతో కార్పొరేటర్లు నొచ్చుకున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సరస్వతి, డీఈ జ్యోతి, ఆర్వో వేణుగోపాల్, నర్సింహరాజు, ఏఈ వినీల్ గౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పనులకు నిధులు కేటాయించాలి


హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ ఎండీ కె.అశోక్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్ : శివారు కాలనీల్లో మిగిలిపోయిన యూజీడీ ట్రంక్‌లైన్ పనుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని శనివారం హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ ఎండీ కె. అశోక్‌రెడ్డికి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి వినతి పత్రం సమర్పించారు. కాలనీల్లో నూతన యూజీడీ ఏర్పాటు కోసం రూ. 4 కోట్లు, ఎస్‌సీ సబ్‌ప్లాన్ కింద అదనంగా మరో రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు. సీఎస్‌ఎస్ కాలనీ, గాయత్రినగర్, పవనగిరికాలనీ, ప్రియదర్శిని కాలనీ, షిర్డీ సాయినగర్, రాజరాజేశ్వరికాలనీల్లో యూజీడీ ట్రంక్‌లైన్ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ ఎండీ కె. అశోక్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# జడ్పీరోడ్డు పొడవునా..అక్రమ వాణిజ్య షెడ్లు


జడ్పీరోడ్‌లో అక్రమంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలు

వనస్థలిపురం : ఎల్బీనగర్ సర్కిల్‌లోని హస్తినాపురం డివిజన్ అక్రమ నిర్మాణాలకు హద్దులు లేకుండా పోయింది. ప్రధానంగా వాణిజ్య కేంద్రంగా ఉన్న జిల్లా పరిషత్ రోడ్డు దారుణంగా మారిపోయింది. అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మిస్తున్న వాణిజ్య షెడ్లు సమస్యగా మారుతున్నాయి. వందల సంఖ్యలో వెలిసిన షెడ్లు నిత్యం ట్రాఫిక్ జామ్‌నకు కారణమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిత్యం క్షేత్ర స్థాయిలో తిరుగుతున్నా.. వారి కంటికి అక్రమ నిర్మాణాలు కనిపించకపోవడం గమనార్హం. వాటి వెనుక అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

### అనుమతులు కొంత.. అక్రమాలు కొండంత

రెండు కిలోమీటర్ల మేర ఉన్న జడ్పీరోడ్డు, పరిసరాల్లో అనుమతులు ఉన్న భవనాల సంఖ్యకంటే లేకుండా నిర్మించిన వాణిజ్య షెడ్లే ఎక్కువ. రెండేండ్లలో 100కు పైగా షెడ్ల నిర్మాణం జరిగింది. కొన్నింటిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నిర్మాణదారులు ఒక్క రూపాయి కూడా జీహెచ్‌ఎంసీకి చెల్లించకుండా నిర్మాణాలు పూర్తి చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వారి వద్ద అధికారులు బేరసారాలు సాగించి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

### ఫిర్యాదులున్నా చర్యలేవి ..?

అక్రమ నిర్మాణాలపై అధికారులు కనీసం చర్యలు తీసుకోవట్లేదన్న విమర్శలున్నాయి. చిరు వ్యాపారులపై ప్రతాపం చూపిస్తూ పోలీసుల బందోబస్తుతో వచ్చి మరీ వాటిని తొలగిస్తారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాణిజ్య షెడ్లు, బహుళ అంతస్తుల భవానాలను పట్టించుకోట్లదని పలువురు వాపోతున్నారు. సంతోషిమాత ఆలయం రోడ్‌లో వాణిజ్య షెడ్డు, జడ్పీ రోడ్‌లో వాణిజ్య షెడ్, షెటర్లు, శ్రీరమణ కాలనీలో బహుల అంతస్తుల భవనాలు, ఇలా చాలా ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

### సెటిల్‌మెంట్లు చేసుకుంటూరు



జడ్పీరోడ్‌లో అక్రమంగా నిర్మించిన వందల వాణిజ్య షెడ్ల కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణాలు పోయిన ఘటనన్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితులు వచ్చాయి. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే సదరు నిర్మాణదారులపై టౌన్‌ప్లానింగ్ అధికారులు లాలూచీ పడుతున్నారు. లేదంటే ఇన్ని అక్రమ షెడ్లు, నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలి.

- జాల శివయాదవ్, హస్తినాపురం